# ఓటుతో సమర్థ నాయకుడికే పట్టం

- మహిళా సాధికారతకు పెద్దపీట
- విద్య, ఉద్యోగ అవకాశాలు కల్పించే అభ్యర్థికే మద్దతు
- 'సాక్షి' ప్రజా ఎజెండా చర్చా గోష్టిలో 'డ్వాక్రా' మహిళల స్పష్టీకరణ


సాక్షి చర్చా గోష్టిలో పాల్గొన్న డ్వాక్రా గ్రూప్ మహిళలు

చంపాపేట: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించే సత్తా.. స్థానిక సమస్యలపై అవగాహన...వాటికి శాశ్వత పరిష్కారం చూపడం... పేద, బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటానని అభయమివ్వడంతో పాటు మహిళా సాధికారతకు కృషి చేసే వ్యక్తిని ఎమ్మెల్యేగా ఎన్నుకుంటామని డ్వాక్రా గ్రూప్ మహిళలు స్పష్టం చేశారు. శనివారం చంపాపేట డివిజన్ కటకోనికుంట కాలనీలో 'సాక్షి' ఆధ్వర్యంలో ప్రజా ఎజెండా పేరుతో డ్వాక్రా గ్రూప్ మహిళతో ఏర్పాటు చేసిన చర్చా గోష్టి వాడివేడిగా సాగింది. ప్రతి ఓటరు ప్రలోభాలకు లొంగకుండా విద్య, వైద్య రంగాలకు ఎక్కువ ప్రాధాన్యం, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే పార్టీ అభ్యర్థులకే ఈసారి తమ ఓటు వేస్తామని మహిళలు స్పష్టం చేస్తున్నారు.

## ప్రలోభాలకు లొంగ రాదు



ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కుతో నిస్వార్థి, నిత్యం కాలనీవాసులతో మమేకమై కష్ట సుఖాలలో పాలు పంచుకునే అభ్యర్థినే ఎన్నుకోవాలి. స్థానిక సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు చేయించే సత్తా ఉన్న అభ్యర్థికే పట్టం కట్టాలి.

– వరలక్ష్మి, కటకోనికుంట, స్త్రీ శక్తి డ్వాక్రా గ్రూప్ అధ్యక్షురాలు

## మహిళలకు అన్నిరంగాల్లో సముచిత స్థానం



మహిళలకు అన్ని రంగాలలో సముచిత స్థానం కల్పిస్తూనే సంక్షేమ పథకాల అమలులో పక్షపాత ధోరణి, స్వార్థ చింతన లేని అభ్యర్థినే ఎన్నుకోవాలి. కాలనీల మౌలిక సమస్యల పరిష్కారంపై అవగాహనతో పాటు నిత్యం కాలనీవాసులతో మమేకమై ఉండే నాయకుడినే ఎన్నుకోవాలి.

-కవిత, నెహ్రూనగర్

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి



కుల, మత, వర్గ, ప్రాంతీయ భేదాలు లేకుండా నిస్వార్థంగా అర్హులందరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు గడప గడపకు అందించే అభ్యర్థికే ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలి. ప్రచార ఆర్భాటాలతో అమలకు నోచుకోని హామీలతో కపట ఆత్మీయతను ఒలకబోసే అభ్యర్థులకు ఓటుతో తగిన శాస్తి చేయాలి.

– నీలిమ, చంపాపేట

## విద్యా రంగానికి ప్రాధాన్యం ఇచ్చే పార్టీకే..



రాష్ట్రంలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు సదుపాయాలు కల్పిస్తున్న ప్రభుత్వం బోధనా సిబ్బంది నియామకాలను మాత్రం మరిచిపోతున్నది. దీంతో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు సన్నగిల్లుతున్నాయి. బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ మేనిఫెస్టో ప్రకటించే పార్టీ అభ్యర్థులనే ఎన్నుకోవాలి.

-జయంతి, రెడ్డి బస్తీ

# మలక్‌పేటలో క్రిస్టియన్ కమ్యూనిటీహాల్: బలాల

జంగ్ 2023 తెలంగాణ


ఎమ్మెల్యే బలాలను సన్మానిస్తున్న క్రిస్టియన్ అసోసియేషన్ నాయకులు

మలక్‌పేట: నియోజకవర్గంలో క్రిస్టియన్ కమ్యూనిటీహాల్ ఏర్పాటు చేయిస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి అక్బర్ బాగ్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్రైస్తవులకు ఎల్లప్పుడు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. బండ్లగూడ శ్మశాన వాటికలో మలక్‌పేట క్రైస్తవులకు చోటు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. శ్మశాన వాటిక నిర్వాహణ కమిటీలో మలక్‌పేట నుంచి ఒకరికి అవకాశం కల్పించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. మరోసారి మజ్లిస్ పార్టీని గెలిపించాలని కోరారు. సీనియర్ పాస్టర్, బిషప్ తిమోతి కొల్లబత్తుల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈస్ట్ హైదరాబాద్ అసోసియేషన్ అధ్యక్షుడు జయకర్ డేవిడ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి. సాల్మన్‌రాజ్, పాస్టర్లు, క్రైస్తవ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు


బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట: ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం చంపాపేట డివిజన్ మాధవనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో పలు పార్టీలకు చెందిన 70 మంది మహిళలు, యువకులు సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో డివిజన్ పార్టీ అధ్యక్షుడు రాజిరెడ్డి, కృష్ణమాచారి, శివగౌడ్, జగదీష్‌గౌడ్, తలారి సత్యప్రకాష్, అంజిరెడ్డి, మేక సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### ప్రశాంత్‌నగర్ శ్రీషిర్డీ సాయి సంస్థాన్ కార్యవర్గం ఎన్నిక

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ ప్రశాంత్ నగర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా సంస్థాన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, వైస్ చైర్మన్‌లుగా డి.వెంకటేశ్వర్‌రావు, ఆర్.వేణుగోపాల్‌రావు, ప్రధాన కార్యదర్శిగా జే.రవీంద్రబాబు, సంయుక్త కార్యదర్శిగా బి.ప్రభాకర్, కోశాధికారిగా ఎం.వి.వెంకటరత్నం, కార్యవర్గ సభ్యులుగా ఆర్.అంజయ్య, పి.రాజేంద్రప్రసాద్, వి.నిర్మలాచౌదరి, వై.సీతారామిరెడ్డి, కే.శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. రెండేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుందని చైర్మన్ తెలిపారు.

### కార్మికులకు చీరలు పంపిణీ

దిల్‌సుఖ్‌నగర్: దసరా పండగ సందర్భంగా వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ ఆలయంలోని కార్మికులకు రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు మధుర ఉపేందర్‌రెడ్డి శనివారం చీరల పంపిణీ చేశారు. ఈ దసరా పండుగను అందరూ సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయంలోని కార్మికులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ముగిసిన 'బైబిల్ స్కూల్'


సీయోను ప్రార్థన మందిరంలో చిన్నారులు

వనస్థలిపురం: దసరా సెలవుల సంర్భంగా వనస్థలిపురం ఎన్జీఓస్ కాలనీలోని సీయోను ప్రార్థన మందిరంలో అక్టోబర్ 16 నుంచి నిర్వహిస్తున్న విరామ బైబిల్ పాఠశాల శనివారంతో ముగిసింది. ఒకేషనల్ బైబిల్ స్కూల్ (వీబీఎస్) లో భాగంగా చిన్నారులకు కథలు, పాటలు, బైబిల్ లోని కంఠత వాక్యాలు, ఇతర కార్యక్రమాలు నేర్పించారు. ఇందులో ప్రతిభ కనబరచిన చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. చివరిరోజు ప్రేమ విందు నిర్వహించారు. కార్యక్రమంలో హెబ్రోను దైవ సేవకుడు బ్రదర్ డేవిడ్ పుష్పరాజ్, సంఘ పెద్దలు జెకర్యా, చినరాజు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### శుభాకాంక్షలు


త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా నియమితులైన మలక్‌పేట మాజీ ఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డిని శనివారం కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఎన్‌రెడ్డి డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి. – ఎల్బీనగర్

### నిద్రమత్తులో డివైడర్ ఎక్కించాడు!



నాగోలు: సిమెంట్ ఇటుకల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి ఫ్లైఓవర్ డివైడర్ పైకి ఎక్కిన ఘటన ఎల్బీనగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... లారీ విజయవాడ నుంచి ఎల్‌బీనగర్ వైపు వస్తుండగా డ్రైవర్‌కు నిద్ర రావడంతో ఫ్లైఓవర్ డివైడర్‌పైకి ఎక్కించాడు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. శనివారం మధ్యాహ్నం సిమెంట్ ఇటుకలను మరో లారీలోకి ఎక్కించి ప్రమాదానికి గురైన లారీని అక్కడ నుంచి తరలించారు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

## వరదనీటి కాలువ పనులు వేగవంతం చేయండి


పద్మానగర్‌లో కాలువ పనులను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని పలు లోతట్టు కాలనీల్లో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ వరదనీటి కాలవల పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలనీ స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అధికారులను, కాంట్రాక్టర్ ను కోరారు. డివిజన్ పరిధిలోని పద్మానగర్ కాలనీలో కొనసాగుతున్న వరద నీటి కాలువ పనులను శనివారం ఆయన ఎస్ఎన్‌డీపీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలువ నిర్మాణ దశలోనే కాలనీ వాసులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా సీవరేజీ లైన్, కేబుళ్లు, తాగునీటి పైప్ లైన్లను కాలువ మధ్యలో కాకుండా కాలువపై స్లాబ్ కింద ఏర్పాటు చేయాలని సూచించారు. ఇప్పటికే పలు కాలనీలలో వరద నీటి కాలువలు పూర్తయినా ఇరుపక్కల సీసీ రోడ్డు ఎందుకు వేయలేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. కార్పొరేటర్ వెంట ఎస్ఎన్‌డీపీ అధికారులు వెంకట్‌రెడ్డి, కృష్ణయ్య, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

## నా హయాంలోనే ఎల్బీనగర్ సమగ్రాభివృద్ధి జరిగింది

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


విలేకరులతో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

హస్తినాపురం: తాను ఎమ్మెల్యేగా పనిచేసిన ఐదేళ్లలో ఎల్‌బీనగర్ సమగ్రాభివృద్ధికి కృషి చేశానని వైఎస్ ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తన హయాంలోనే సాగర్ రింగ్‌రోడ్డులోని ఫ్లైఓవర్, అండర్‌పాస్‌లు, ఎల్‌బీనగర్ రింగ్‌రోడ్డు, కామినేని, నాగోలు ఫ్లైఓవర్లు మంజూరు చేయించి పనులు ప్రారంభించానని చెప్పారు. ఆర్.కృష్ణయ్య శనివారం హస్తినాపురంలో లింగోజీగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నో కరప్షన్, నో కమీషన్ నినాదంతో అభివృద్ధి పనులు చేశానని, ఎల్‌బీనగర్ ప్రజల గుండెల్లో తన స్థానం పదిలంగా ఉందన్నారు. తన హయాంలో జరిగిన అభివృద్ధి పనులు మును పెన్నడూ జరగలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఎన్నో పోరాటాలు చేశానన్నారు. నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి పెద్దఎత్తున నిధులు కేటాయించానని కృష్ణయ్య తెలిపారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

చంపాపేట: ఎల్‌బీనగర్ అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు శ్రమిస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం నల్లేరు మీద నడక వంటిదని రాష్ట్ర బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఓరుగంటి వెంకటేశంగౌడ్ అన్నారు. శనివారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎల్‌బీనగర్‌లో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘ నాయకలు నందికంటి చంద్రశేఖర్, మేడారం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అర్చనలు...యాగాలు

మలక్‌పేట/ఎల్బీనగర్ జోన్ బృందం: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఎల్బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చనలు చేశారు. శనివారం సైదాబాద్ మాతామైదాన్‌లో కొలువుదీరిన విజయదుర్గామాత మహాసరస్వతి అలంకరణలో, ఆర్‌కేపురం డివిజన్‌లోని ప్రత్యంగిరా దేవి ఆలయంలోని అమ్మవారు లలితా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

- సైదాబాద్ జీవన్‌జ్యోతి సంఘంలోని జయదుర్గ అమ్మవారిని హోంమంత్రి మహమూద్ అలీ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ కుమారుడు భూమేశ్వర్ శాలువా కప్పి సన్మానించారు.


లలితాదేవిగా ప్రత్యంగిరా దేవి


నాగోలు లలితానగర్‌లో చండీయాగం


జయదుర్గ సేవలో హోంమంత్రి మహమూద్ అలీ


కొత్తపేటలో అమ్మవారి పూజలో శ్రీనివాస్‌గుప్తా

# ఐఎస్‌సదన్‌లో బతుకమ్మ వేడుకలు


బతుకమ్మ ఆడుతున్న సామ స్వప్న, స్వర్ణలతారెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతీ నగర్ కాలనీలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఐఎస్‌సదన్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ స్వప్నాసుందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రాష్ట్ర హోంమంత్రి మహమూద్‌అలీ, యాకత్‌పురా నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి, పలువురు కార్పొరేటర్‌లు, మాజీ కార్పొరేటర్‌లు పాల్గొన్నారు. అందంగా తీర్చిదిద్దిన బతుకమ్మల చుట్టూ మహమూద్ అలీ, సుందర్‌రెడ్డి, అజం అలీలు మహిళలతో కలిసి కోలాటం ఆడారు.

**సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు...**


కొత్తపేటలో పూల కొనుగోళ్లు

దిల్‌సుఖ్‌నగర్: బతుకమ్మ సంబరాల చివరిరోజైన సద్దుల బతుకమ్మ సంబురాల కోసం అంతట ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ప్రధాన రోడ్లు, చౌరస్తాలు బతుకమ్మ పూల కొనుగోలు, విక్రయదారులతో సందడిగా మారాయి. ఇలా ఉండగా, వేడుకలు ముగింపు దశకు చేరడంతో మహిళలు శనివారం సాయంత్రం బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మలక్‌పేట కాంగ్రెస్ అభ్యర్థిని మార్చండి

పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మక్బూల్ అహ్మద్



చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని మార్చాలని నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ మక్బూల్ అహ్మద్ అధిష్టానాన్ని కోరారు. శనివారం మలక్‌పేటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ పటిష్టత కోసం అహర్నిశలు పనిచేసిన నాయకులను కాదని కొత్తవారికి టికెట్ కేటాయించడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కాంగ్రెస్ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీని వదలకుండా కార్యకర్తలతో కలిసి పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా తాము ప్రజల్లోకి తీసుకెళ్లామన్నారు. ఎన్నికలు వచ్చేసరికి తమకు కాకుండా నియోకవర్గం గురించి ఏమాత్రం అవగాహన లేని వ్యక్తికి టికెట్ కేటాయిస్తే నియోకవర్గంలో పార్టీ పరిస్థితి ఏమవుతుందో ఆలోచించాలని కోరారు. టికెట్ ఆశిస్తూ పార్టీకి దరఖాస్తు చేసుకున్న స్థానిక నాయకుల్లో ఒకరికి టికెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎవరికి టికెట్ కేటాయించినా ఇతర నాయకులు, కార్యకర్తలు కలిసి పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన పాశం శ్రీశైలం


మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు

చంపాపేట: రంగారెడ్డి జిల్లా బీజేపీ దళిత మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి చంపాపేటకు చెందిన పాశం శ్రీశైలం, బీజేవైఎం నాయకులు నిఖిల్‌గౌడ్, చందర్, బాబు, కాంగ్రెస్ పార్టీకి చెందిన నవీన్, మహేందర్‌లు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో వారు బీఆర్‌ఎస్ కండువాలు కప్పుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సుంకోజు కృష్ణమాచారి, ముడుపు రాజిరెడ్డి, అంజిరెడ్డి, రవిముదిరాజ్, నిషికాంత్‌రెడ్డి, గౌతంరెడ్డి పాల్గొన్నారు.

## ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి: బీఎస్పీ


మంగళి షాపులో కటింగ్ చేస్తున్న యాదగిరి

హస్తినాపురం: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం తన శాయశక్తులా కృషి చేస్తానని, బీఎస్పీ అధికారంలోకి రాగానే ప్రజలకు ఉచితంగా విద్య, వైద్యాన్ని అందిస్తామని ఎల్‌బీనగర్ నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌ఛార్జి జక్క యాదగిరి అన్నారు. శనివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బార్బర్ షాపులో కటింగ్ చేసిన ఆయన బీఎస్పీని గెలిపించాలని అక్కడి వారిని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు ఆనగల స్వామి, ఎర్ర అశోక్, అనిల్‌యాదవ్, గుత్తి శేఖర్, మహేశ్, నరసింహ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వాహన తనిఖీల్లో రూ. 23 లక్షలు స్వాధీనం

హస్తినాపురం: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని వనస్థలిపురం పోలీసస్టేషన్ పరిధిలో పోలీసులు శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 23 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జలేంధర్‌రెడ్డి వెల్లడించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని రెడ్ వాటర్ ట్యాంక్ దగ్గర తనిఖీ చేయగా రూ.3 లక్షలు, వనస్థలిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల దగ్గర తనిఖీలు చేయగా 20 లక్షల రూపాయలు లభించాయన్నారు. స్వాధీనం చేసుకున్న నగదును ఎల్‌బీనగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అప్పగించామని సీఐ చెప్పారు.

**చైతన్యపురిలో రూ.16.17 లక్షలు...**

చైతన్యపురి: కారులో అనుమతి లేకుండా తరలిస్తున్న రూ.16,17,770 నగదును చైతన్యపురి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. శనివారం చైతన్యపురి చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో సికింద్రాబాద్ గాంధీనగర్‌కు చెందిన రైటర్ సగా గార్డ్ ప్రైవేటు లిమిటెడ్‌లో పనిచేసే బండారం ప్రదీప్‌కుమార్ (36) ఎటువంటి పత్రాలు లేకుండా రూ. 16,17,770 నగదు తరలిస్తున్నట్లు గుర్తించారు. నగదును సీజ్ చేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమాచారం ఇచ్చారు.

**ఎల్‌బీనగర్‌లో రూ. 5 లక్షలు...**

నాగోలు: ఎల్‌బీ నగర్ పోలీసులు చింతలకుంట వద్ద శనివారం వాహన తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో గూడూరు చంద్రకాంత్‌రెడ్డి అనే వ్యక్తి కారులో ఎలాంటి ప్రతాలు లేకుండా రూ. 5 లక్షలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు.


స్వాధీనం చేసుకున్న నగదును చూపిస్తున్న వనస్థలిపురం సీఐ జలేంధర్‌రెడ్డి